

# బలగం

డాక్టర్ పి.వి. రమణ

ఆమెకు. బయటకెళ్ళలేనినిస్సత్తువ; మనసునిండా స్తబ్దత; బ్రతుకునిండా వెలితి; భరించరాని వెలితి! పనిమనిషికి చెప్పింది, అవన్నీ తెచ్చి పచ్చడి చేయమని. లోపలి గదిలోకొచ్చి మంచంమీద వాలిపోయింది సుజాత. చుట్టూపర్చుకొన్న ఒంటరితనం... ఈ ఒంటరితనం నుండి వెళ్ళుకొచ్చే భయంకర శూన్యం... ఈ శూన్యంలో కాలం కదిలినట్లే ఉండదు. ఇంటినిండా ఎన్నో వస్తువులు అలంకారానికి తగ్గట్టుగా... కొత్తలో ఇవి చూసుకొనే ఏదో మిడిసిపాటు... ఇప్పుడు... తనతో పాటు అవీ శూన్యంలో బిక్కు బిక్కుమంటూ... సుజాత మనసు బావురుమంది. తన గూడులో తనే తిరిగి సాలీడులా ఈ ఇంటిలో తన నీడే తోడుగా తన సంచారం... సుజాతకు ఆవేదన పెరిగిపోయింది. ఈ పండుగనాడుగూడా ఈ మనిషికి ఇల్లు గుర్తుకు రాదెందుకో... ఆమె హృదయం ఆక్రోశించింది. మనసు వద్దంటున్నా గతాన్నే కెలుకుతున్నది.

తీర్థయాత్రల్నుండి అప్పుడప్పుడూ చుట్టం చూపుగా వచ్చే అత్తగారుగూడా తనలాగే ఒంటరి బ్రతుకుతో ఎంతగా అల్లాడిపోయేదో; "అమ్మా సుజాతా... వీడి నాన్నగారిక్కూడా విదేశాలమీదే మోజు. కొడుకులు సంపాదించి పెట్టే అవసరం లేకపోయినా, వీడికంటే పెద్దవాళ్ళు ముగ్గుర్నీ అమెరికాలోనే స్థిరపడేట్లు చేశారు. చివరకు ఒక్కగానొక్క కూతుర్నిగూడా అక్కడి సంబంధమే చేసి పంపించారు. ఇట్లా ఎందుకు చేశారో ఇప్పటికీ నాకు అంతుపట్టకుండా ఉంది. అందరూ ఉండి, ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా ఎక్కడెక్కడో ఎవరికి వారే బ్రతకటం... ఈ పరిస్థితి నాకు భరించలేనిదిగా ఉండేది మొదట్లో; తట్టుకోలేక తల్లడిల్లి పోయేదాన్ని... చివరకు ఆయనకూడా స్వర్గస్థు లయ్యాక ఇంట్లో ఉండటం దుర్భరమనిపించేది; తరుణోపాయంగా ఇట్లా తీర్థయాత్రల్తో పొద్దుపుచ్చు కొంటున్నాను; వీడైనా ఇంటి పట్టున నీతో ఉండక బయట ఊళ్ళల్లో గడపటం చూస్తుంటే... అసలీ ఇంటికే ఏదోశాపం ఉన్నట్లుగా అన్పిస్తున్నది; వీడైనా ఇంటిపట్టున స్థిరంగా ఉంటే, ఈ తీర్థయాత్రలు మాని నాకూ ఇంటిపట్టునే ఉండిపోవాలన్పిస్తున్నది. నాకూ రోజులు దగ్గరపడ్డాయి. ఓపిక నశించింది. దేనికైనా పెట్టి పుట్టాలితల్లీ; ఈ ఇల్లు మాతోపాటు, నీకు అచ్చిరానట్లే అన్పిస్తున్నదమ్మా" అత్తగారి మనోవేదనే తనకూ తూచా తప్పక అనుభవమవుతూంది.

"సుజాతా... సుజాతా..." ఎదురింటి సావిత్రమ్మ గారి పిలుపులు క్రిందనుంచి, కళవళపాటుతో లేచింది సుజాత. కన్నీరద్దుకొంటూ మేడదిగివచ్చింది. "ఉగాది ప్రసాదం తల్లీ... తీసుకో... కనీసం, 'రమ' అన్నా ఈ పండక్కి వస్తుందనుకొన్నాను. ఈ పండుగనాడు తల్లితో గడపాలిట ఆడపిల్లలు... సరే వస్తానమ్మా... బలగ మంతా వచ్చి ఉంది... ఇంకా చాలా పన్లు ఉన్నాయి" అంటూ ప్రసాదం గిన్నెను చేతికిచ్చి వెళ్ళిపోయింది సావిత్రమ్మ. ఆ సమయంలో ఆ ఉగాది పచ్చడి సాక్షాత్తూ భగవంతుడే ప్రత్యక్షమై ఇచ్చిన ఇష్టమైన వరంలా అన్పించింది సుజాతకు. ఆ వరంతోపాటే తన బ్రతుకంతా శుభాలమయం అయిపోతుందన్న ఆశీర్వాదం కూడా ఉన్నదన్న సంతోషంకల్గింది సుజాతకు. ఆత్రంగా పైకివెళ్ళి రెండు స్పూన్లతో పచ్చడిని నోట్లో వేసుకొంది. సుజాతలో ఏదో క్షణికమైన ఆనందం. "కనీసం 'రమ' అయినా ఈ పండక్కొస్తుందనుకొన్నాను" అన్న సావిత్రమ్మగారి మాటలే సుజాత అంతరంగాన్ని క్షోభతో నలిపివేస్తున్నాయి. తానెంత మొత్తుకొన్నా, వద్దని ప్రాధేయపడ్డా వినకుండా 'రమ'కీ అమెరికా సంబంధమే చేసి, పంతం నెరవేర్చుకొన్నాడు భర్త. భర్తతో అది అమెరికా వెళ్ళి అప్పుడే సంవత్సరం కావొస్తున్నది. ఈ సంబంధాన్ని తన భర్త అన్నలే చూసిపెట్టారు. ఈ దేశమంటే వాళ్ళకెందుకో ఇంత అయిష్టత అన్న విషయం సుజాతకిప్పటికీ అర్థంకాదు. తన బ్రతుకు చుట్టూ అల్లుకొన్న అర్థంకాని విషాదాల్లో ఇదీ ఒకటేమో;

అసలు సంతానాన్నికనటమెందుకో, వల్లమాలిన ఆపేక్షల్ని వాళ్ళచుట్టూ అల్లుకోవటమెందుకో! కనీసం మనసైనప్పుడన్నా కంటినిండుగా చూసుకోవటానికి అవకాశమేలేని ఈ విదేశీ సంబంధాలకు ముడిపెట్టు కోవటమెందుకో, ఏదో శాపం వెంటబడ్డట్లు కావాలని ఈ దిక్కుమాలిన, తోడుకరువైన విషాద బ్రతుకును కోరి వరించటమెందుకో, సుజాతకిప్పటికీ అర్థంగాని విషయమే. తన ప్రమేయం ఏమీ లేకపోయినా తనూ ఈ దురవస్థలోనే కూరుకుపోయింది. సుజాత అంత రంగంలో తిరిగి కల్లోలం; తట్టుకోలేని క్షోభం; లేచి కిటికీ దగ్గిరికొచ్చింది.

ఎదురింటిలో చేరిన బలగాన్ని, ఆ బలగం తెచ్చిన సంబరాన్ని చూస్తూ ఉండిపోయింది సుజాత దీనంగా అన్యమనస్కంగా! ●


# మనం

ప్రప్రథమ వినియోగదార్ల

## మాస పత్రిక

అధిక ధరలు - ఆహారపదార్థాలలో కల్తీ నాసిరకం వస్తువుల విక్రయం - మందుల కంపెనీల మోసాలు - డిస్కౌంటు సేల్స్ వంటి అక్రమ వ్యాపార పద్ధతులు - అసత్య వ్యాపార ప్రకటనలు-ఇలా అనేక సమస్యలకు పరిష్కారం సూచించటానికి మీ ముందుకు వస్తోంది 'మనం' (వినియోగ దార్ల మాసపత్రిక). వినియోగదార్ల ఉద్య మంలో రెండు దశాబ్దాలకు పైగా అనుభవం గడించిన శ్రీ పరిగి వసంత్ కుమార్ సంపాదకత్వంలో మీకు నెలనెలా ఆసక్తి కరమైన విషయాలను తెలియజేసే పత్రిక 'మనం' జనవరి 1990న తొలి సంచిక ప్రారంభం. వార్షిక చందా 25 రూపాయలు మాత్రమే. పత్రికలోని విషయాలను తెలుసు కుంటే నెలకు 200 రూపాయలు ఆదా - ఈ రోజే చందాదారులుగా చేరండి - మనియార్డర్లు లేదా డి.డి.లు కన్స్యూమర్ ఎడ్యుకేషన్ సెంటర్ పేరిట పంపవలసిన చిరునామా:

'కన్స్యూమర్
ఎడ్యుకేషన్ సెంటర్,
నెం.3, శేష్ విలాస్,
3-6-293, ఫస్ట్ ఫ్లోర్, హైదరగూడ,
హైదరాబాదు - 500 029
ఫోను: 231839

"వినియోగదార్ల ఉద్యమానికి
చేయూత నివ్వండి
'మనం' మాసపత్రికకు
చందాదారులుగా చేరండి"